www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 74 | | 27-8-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## భారత్ ధర్మశాల కాదు!



.. వివరాలు 4లో

- దేశంలో నివసించే హక్కు పౌరులకే: అమిత్ షా
- అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపాలని భద్రతా సంస్థలకు దిశానిర్దేశం
- అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తి చేయడమే లక్ష్యమని వెల్లడి

## 22ఏ తీసేయకుంటే సచివాలయం ముట్టడి

- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి
- ప్రజల ఆస్తులపై 22ఏ తాళం.. ప్రభుత్వ భూములు అమ్మకానికి
- భూవివాదాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బ
- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బ్రోకర్లకు ఒక్క రూపాయి ఇవ్వొద్దు..
- బాధితులకు అండగా ఉంటాం
- రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజం



3

## మోహన్ భగవత్ సభపై మమ్దానీ అభ్యంతరం

- న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ కార్యక్రమంపై రాజకీయ దుమారం
- మేయర్ తీరుపై మండిపడ్డ అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్

4





# తెలంగాణ సమ్మిట్‌కు వార్ రూమ్

డిసెంబర్ సమ్మిట్‌కు దేశ, విదేశాల్లో విస్తృత రోడ్‌షోలు

## ప్రజాభవన్‌లో తక్షణమే ఏర్పాటుకు భట్టి ఆదేశం

- అతిథులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియ వేగవంతం చేయాలి
- గత అవగాహన ఒప్పందాల పురోగతిపై ప్రత్యేక సమీక్ష
- రోజూ గంటపాటు పనుల పురోగతిని సమీక్షించనున్న సీఎస్

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026, ఇన్వెస్ట్ తెలంగాణ' కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. సమ్మిట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షించింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో వార్ రూమ్ పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని భట్టి సూచించారు. వార్ రూమ్ పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షించాలని చెప్పారు. సమ్మిట్ కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ కమిటీల్లో అవసరమైన నిపుణులు, కీలక అధికారులను భాగస్వాములను చేయాలని సూచించారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్, ఆగస్టు 26

2



## ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుస్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి

2

# మృత్యుఘోష

- కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆరుగురు ప్రయాణికులు దుర్మరణం
- ఆగివున్న ఐరన్ లారీని ఢీకొట్టిన బస్సు
- 20 మందికి తీవ్ర గాయాలు
- మృతులంతా ఏపీకి చెందినవారే
- ఘటనపై సీఎం, మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతి







తెల్లవారుజామున గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులను మృత్యువు వెంటాడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతులను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

- ఉద్యమ కెరటం, సూర్యాపేట, ఆగస్టు 26

2

## అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం



- చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురు దుర్మరణం
- నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

2

అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది.



# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

## వందలాది మంది గల్లంతు!

టిబెట్‌లో భూకంపం, విరిగిపడిన మంచుచరియలతో ఉప్పొంగిన భోటేకోశీ నది

గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ▪ బిహార్, యూపీలకు అలర్ట్

నేపాల్ ప్రధానికి ప్రధాని మోదీ ఫోన్ ▪ తక్షణ సహాయక చర్యలకు హామీ

2



నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పొటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
27 ఆగస్టు 2026



# మృత్యుఘోష

**కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు ప్రయాణికులు దుర్మరణం**

**ఆగివున్న ఐరన్ లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు**

## మృతులంతా ఏపీకి చెందినవారే

**సూర్యాపేట, ఆగస్టు 26:** తెల్లవారుజామున గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులను మృత్యువు వెంటాడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతులను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇనుప సామగ్రితో ఉన్న లారీ రహదారిపై ఆగి ఉండగా ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు లారీలోని ఇనుప సామగ్రి బస్సులోకి చొచ్చుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తెల్లవారుజాము కావడంతో పలువురు ప్రయాణికులు నిద్రలో ఉండటం, ప్రమాదాన్ని గుర్తించి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఉదయం 9 గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం అనంతరం బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

### 'కళ్ల ముందే నా భార్య చనిపోయింది'

ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఓ ప్రయాణికుడి ఆవేదన అక్కడున్న వారిని కలచివేసింది. తన వెనుక సీటులో కూర్చున్న భార్య ప్రమాదంలో కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయిందంటూ ఆయన కన్నీరుమున్నీరయ్యారు. టీ విరామం అనంతరం బస్సు తిరిగి బయలుదేరిన గంటలోపే ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికుల్లోనూ కొందరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇనుప సామగ్రి బస్సులోకి దూసుకురావడంతో ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. "డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తులో బస్సు నడపడమే ఈ ఘోరానికి కారణం. నా కళ్ల ముందే నా భార్య ప్రాణాలు కోల్పోయింది" అంటూ బాధిత ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిలో 14 మందిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పలువురికి తల, ఛాతీ, కడుపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఇనుప సామగ్రి బలంగా తాకడంతోనే గాయాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. అప్పటికే ప్రమాదానికి గురై రహదారిపై నిలిచిపోయిన లారీని ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సకాలంలో గుర్తించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

కోదాడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రయాణికుల భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు వ్యవహరించాలని సూచించారు.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

**చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురు దుర్మరణం**

**నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం**

**నిజామాబాద్, ఆగస్ట్ 26:** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణ సమ్మిట్‌కు 'వార్ రూమ్'

- ప్రజాభవన్‌లో తక్షణమే ఏర్పాటుకు భట్టి ఆదేశం
- డిసెంబర్ సమ్మిట్‌కు దేశ, విదేశాల్లో విస్తృత రోడ్‌షోలు
- అతిథులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియ వేగవంతం చేయాలి
- గత అవగాహన ఒప్పందాల పురోగతిపై ప్రత్యేక సమీక్ష
- రోజూ గంటపాటు పనుల పురోగతిని సమీక్షించనున్న సీఎస్



**హైదరాబాద్, ఆగస్టు 26:** ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026, ఇన్వెస్ట్ తెలంగాణ' కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. సమ్మిట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షించింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో వార్ రూమ్ పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని భట్టి సూచించారు. వార్ రూమ్ పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షించాలని చెప్పారు. సమ్మిట్ కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ కమిటీల్లో అవసరమైన నిపుణులు, కీలక అధికారులను భాగస్వాములను చేయాలని సూచించారు.

### ఆహ్వానాల్లో జాప్యం వద్దు

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులను ఆహ్వానించేందుకు చర్యలు వేగవంతం చేయాలని భట్టి ఆదేశించారు. అతిథులకు ఆహ్వాన పత్రాలు పంపడంలో ఏమాత్రం ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరెవరిని ఆహ్వానించాలి, వారితో సంప్రదింపులు ఏ స్థాయిలో ఉన్నాయి తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### దేశ విదేశాల్లో రోడ్‌షోలు

డిసెంబర్‌లో జరగనున్న సమ్మిట్‌ను విజయవంతం చేయడంతో పాటు తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృత స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించాలని భట్టి సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల విధానాలను పెట్టుబడిదారులకు వివరించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు.

### గత ఒప్పందాల పురోగతి తేల్చండి

గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా వివిధ సంస్థలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల పరిస్థితిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్ని ఒప్పందాలు కార్యరూపం దాల్చాయి, ఎన్ని ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి, ఎక్కడ జాప్యం జరుగుతోంది, పెట్టుబడులు ఎంతవరకు వచ్చాయన్న అంశాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని భట్టి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీకి బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

### రోజూ గంటపాటు సమీక్ష

సమ్మిట్ ఏర్పాట్లలో జాప్యానికి తావులేకుండా ప్రతి కమిటీకి స్పష్టమైన కాలపరిమితి నిర్దేశించాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిరోజూ కనీసం గంటపాటు సమ్మిట్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కమిటీ తనకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత కాలపట్టిక ప్రకారం పూర్తి చేసేలా వార్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా మరింత బలంగా ఆవిష్కరించే లక్ష్యంతో సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లకు అవకాశం ఇవ్వకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

## వందలాది మంది గల్లంతు!

**టిబెట్‌లో భూకంపం, విరిగిపడిన మంచుచరియలతో ఉప్పొంగిన భోటేకోశీ నది**

**గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ▪ బిహార్, యూపీలకు అలర్ట్**

**నేపాల్ ప్రధానికి ప్రధాని మోదీ ఫోన్ ▪ తక్షణ సహాయక చర్యలకు హామీ**



**ఖాట్మండు, ఆగస్టు 26:** నేపాల్‌పై ప్రకృతి విరుచుకుపడింది. టిబెట్ వైపు నుంచి ఒక్కసారిగా పోటెత్తిన వరద భోటే కోశీ నదిని మహోగ్రరూపంలోకి మార్చింది. చైనా సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలో బుధవారం ఉదయం సంభవించిన ఆకస్మిక వరదలు గ్రామాలను ముంచెత్తి, ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతైనట్లు సమాచారం. వీరిలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తలు రావడంతో ఆందోళన మరింత పెరిగింది. అయితే గల్లంతైన వారి సంఖ్యపై భిన్నమైన అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో అధికారిక నిర్ధారణ కోసం ఎదురుచూడాల్సి ఉంది. భోటే కోశీ నది ఒక్కసారిగా ఉప్పొంగడంతో నదీ తీర ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఉద్ధృతంగా వచ్చిన నీరు తన దారిలో ఉన్న నిర్మాణాలను కొట్టుకుపోయింది. నువాకోట్, ధాడింగ్ సహా పలు ప్రాంతాలపై వరద ప్రభావం పడింది. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు భద్రతా బలగాలు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగాయి. హెలికాప్టర్లతో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరించారు.

### టిబెట్ నుంచి వచ్చిన జలవిలయం?

నేపాల్‌లో స్థానికంగా భారీ వర్షాలు పడతాయని ముందస్తు అంచనాలు లేకపోయినా టిబెట్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు, కొండచరియలు ఈ విపత్తుకు కారణమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపగ్రహ చిత్రాల్లో సరిహద్దుకు సమీపంలోని పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడిన ఆనవాళ్లు కనిపించినట్లు సమాచారం. టిబెట్‌లో పుట్టే లేండే నది నేపాల్‌లోకి ప్రవేశించి భోటే కోశీలో కలుస్తుంది. ఎగువ ప్రాంతంలో మంచు, కొండచరియలు నదీ ప్రవాహానికి అడ్డుపడి భారీగా నీరు నిలిచిపోయి, ఆ సహజ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగిపోవడంతో నీరు దిగువకు దూసుకొచ్చి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు.

### భూకంపంతో కొండచరియలు?

ఇదే సమయంలో టిబెట్‌లో సంభవించిన భూకంపానికి వరదలకు సంబంధం ఉందా అన్న కోణంలోనూ పరిశీలన సాగుతోంది. భూకంపం కారణంగా కొండచరియలు విరిగిపడి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట ఏర్పడి, అనంతరం అది తెగిపోవడంతో వరద పోటెత్తి ఉండవచ్చన్న ప్రాథమిక అంచనాలు వెలువడుతున్నాయి. భారీ వర్షాలు, మంచుచరియలు, కొండచరియలు, భూకంపం.. వీటిలో ఏది ప్రధాన కారణమన్నది పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే తేలనుంది. హిమాలయ ప్రాంతాల్లో భూతాపం పెరగడం వల్ల హిమనదాలు వేగంగా కరుగుతున్నాయని, ఫలితంగా పర్వతాలపై అస్థిరమైన హిమసరస్సులు ఏర్పడుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొండచరియలు విరిగిపడినా, అధిక వర్షపాతం నమోదైనా ఇటువంటి సరస్సులు ఒక్కసారిగా తెగిపోయి దిగువ ప్రాంతాలపై జలప్రళయాన్ని సృష్టించే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

### భారీగా ఆస్తి నష్టం

వరదల కారణంగా ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. అనేక ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సహాయక బృందాలు చేరుకోవడానికే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గల్లంతైన వారి కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. గాయపడిన వారిని అందుబాటులో ఉన్న వైద్య కేంద్రాలకు తరలిస్తున్నారు.

### భారత్ వైపు దూసుకొచ్చే ప్రవాహం

భోటే కోశీ దిగువకు ప్రవహిస్తూ త్రిశూలీ నదిగా మారి, దేవఘాట్ వద్ద కాళీ గండకి నదిలో కలుస్తుంది. అక్కడి నుంచి నారాయణి పేరుతో ప్రవహించి భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత గండక్ నదిగా పిలుస్తారు. ఈ నది బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాల మీదుగా చివరకు గంగలో కలుస్తుంది. దీంతో నేపాల్‌లో సంభవించిన వరద ప్రభావం దిగువ ప్రాంతాలపై పడే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని భారత్‌లోనూ అప్రమత్తత పెంచారు.

### బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో అప్రమత్తత

నేపాల్ వరదల నేపథ్యంలో గండక్, నారాయణి నదుల్లో నీటిమట్టాల పెరుగుదలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. బిహార్‌లో ఆనకట్టలు, కరకట్టలపై నిరంతర నిఘా పెట్టాలని, రాత్రివేళల్లోనూ గస్తీ నిర్వహించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు ఇచ్చి, అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలను రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ ముఖ్యంగా మహారాజ్‌గంజ్, కుషీనగర్ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. నదుల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్

**వరదలపై ఆరా తీసిన భారత ప్రధాని**

**సహాయ సిబ్బందిని పంపుతామని హామీ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్26:** భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఉద్ధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్ట్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.



# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు



- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి

**హైదరాబాద్, ఆగస్ట్ 26:** కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ప్లాన్ ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ప్లాన్ బీ ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను‘ అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉ ంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# 22ఏ తీసేయకుంటే సచివాలయం ముట్టడి

- భేషరతుగా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి
- ప్రజల ఆస్తులపై 22ఏ తాళం.. ప్రభుత్వ భూములు అమ్మకానికి
- భూవివాదాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు తీవ్ర దెబ్బ
- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బ్రోకర్లకు రూపాయి ఇవ్వొద్దు.. బాధితులకు అండగా ఉంటాం
- రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 26:** సెక్షన్ 22ఏ పేరుతో ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వాటిని భేషరతుగా తొలగించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ రెడ్డి పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని విమర్శించారు. భూవివాదాలు, ప్రభుత్వ నిర్ణ యాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆరోపించారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని బాధితులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ప్రజల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పైసా పైసా కూడబెట్టి ప్రజలు ఇళ్లు, స్థ లాలు కొనుగోలు చేసుకుంటే వాటిని రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పునకు సామాన్య ప్రజలు ఎందుకు కా ర్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. "22ఏలో పెట్టింది మీరే.. తొలగించాల్సింది కూడా మీరే. ప్రజలు దరఖాస్తులు పట్టుకుని ఎందుకు తిరగాలి?" అని ప్రశ్నించారు. 22ఏ కారణంగా అనేక మంది తమ ఆస్తులను అమ్ము కోలేకపోతున్నారని, బ్యాంకు రుణాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో భూములను, హైదరాబాద్‌లో లక్షలాది ఆస్తులను 22ఏ పరిధిలోకి తీసుకొచ్చారని ఆరోపించారు. కాలనీలకు కాలనీలే నిషేధిత జాబితాలోకి వెళ్లాయని అన్నారు. ఒకవైపు ప్రజల ఆస్తులను 22ఏలో పెడుతూ.. మరోవైపు ప్రభుత్వ భూములను అమ్మేందుకు రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ భావితరాలకు జాగా లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. అసైన్డ్ భూములను సైతం తీసుకుని పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌ను దేశం మొత్తం చూసేలా అభివృద్ధి చేశామని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని విమర్శించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో, ఎప్పుడు తమ ఆస్తి 22ఏలోకి వెళ్తుందోనన్న భయంతో ప్రజలు ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆస్తి అవసరానికి అమ్ముకుందామన్నా కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. విదేశాల్లో ఉన్న తెలంగాణవాసులు కూడా హైదరాబాద్‌లో ఆస్తుల కొనుగోలుపై వెనకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. 22ఏ సమస్య పరిష్కారం పేరుతో మధ్యవర్తులు, బ్రోకర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. బాధితులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని సూచించారు. ప్రజల ఆస్తులను కాపాడి వారికి అప్పగించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు ప్రకటించారు. ప్రజల కోసం అసెంబ్లీలో పోరాడటంతో పాటు బయట కూడా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. "మా పోరాటం రాజకీయాల కోసం కాదు.. ప్రజల ఆస్తుల కోసం. ప్రభుత్వం చేసిన తప్పును ప్రభుత్వమే సరిదిద్దాలి. 22ఏ జాబితాలో అన్యాయంగా చేర్చిన భూములను భేషరతుగా తొలగించాలి. లేకుంటే బాధితులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తాం" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

# మీ సేవలే ఇక డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు

- రాష్ట్రవ్యాప్తంగా కొత్త సేవలకు శ్రీకారం
- చిన్న వ్యాపారులకు తక్కువ ఖర్చుతో డిజిటల్ ప్రచారం
- కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు




**హైదరాబాద్, ఆగస్టు 26:** తెలంగాణలోని ప్రతి మీ సేవా కేంద్రాన్ని పౌర సేవలకే పరిమితం చేయకుండా డిజిటల్ మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక చిన్న వ్యాపారులకు డిజిటల్ ప్రచార అవకాశాలను తక్కువ వ్యయంతో చేరువ చేయడమే లక్ష్యంగా 'మీ సేవా-మెటా' సంయుక్త కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్‌లో బుధవారం మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ రెండో దశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపిక చేసిన 140 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లకు (వీఎల్‌ఈలు) 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కొత్త సాంకేతికతను స్వీకరించడంలో, సమ-ర్థవంతమైన పౌర సేవలను అందించడంలో తెలంగాణ రాష్ట్రం ఎప్పుడూ ముందే ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 వేలకుపైగా మీ సేవా కేంద్రాల ద్వారా స్థానిక స్వీట్ షాపులు, టెక్స్‌టైల్ స్టోర్స్, నైపుణ్య వృత్తిదారులు, ఇతర చిన్న వ్యాపారులకు డిజిటల్ ప్రచారాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చని వివరించారు. మీ సేవా కేంద్రాలు ప్రజలకు డిజిటల్ అవగాహన కల్పించి, స్థానిక వ్యాపారుల ఆదాయాన్ని పెంచే వేదికలుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని తొలుత హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ/క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి 120 మంది వీఎల్‌ఈలకు శిక్షణ ఇచ్చామని ఐటీ శాఖ పేర్కొంది. శిక్షణ పొందిన వారిలో 10 మందికిపైగా ఇప్పటికే 17కు పైగా ప్రత్యక్ష డిజిటల్ ప్రకటనల ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల్లో తక్కువ వ్యయంతో స్థానిక వ్యాపారులు తమ ఉత్పత్తులను ప్రచారం చేసుకునే అవకాశం లభించడంతో పాటు వీఎల్‌ఈలకు కూడా అదనపు రాబడి మార్గం సుగమమైంది. తొలి దశ విజయవంతం కావడంతో రెండో దశలో ప్రతి జిల్లా నుంచి 4-5 మంది చొప్పున ఆసక్తి, సామర్థ్యం ఉన్న వీఎల్‌ఈలను ఎంపిక చేసి విస్తరిస్తున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ), ఐటీ అండ్ సీ శాఖ, మెటా సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో మీ సేవా కమిషనర్ టి.రవికిరణ్, మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ శ్రీనివాస్, నిపుణులు దివ్య ఖేమాని, రిషాద్ చిందమడ పాల్గొన్నారు. వ్యాపారులు నేరుగా మీ సేవా ద్వారా డిజిటల్ మార్కెటింగ్ సాయం కోరేందుకు కొత్త పోర్టల్ (meeseva.telangana.gov.in), టోల్‌ఫ్రీ నంబర్లను (1100 / 1800-425-1110) మంత్రి ప్రారంభించారు. ప్రతి వీఎల్‌ఈ మొదట ఒక వ్యాపారంతో మొదలుపెట్టి వందలాది వ్యాపారాలకు తమ సేవలను విస్తరించాలని, స్థానిక వ్యాపార రంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం సూచించింది.



# నేపాల్‌లో తెలంగాణ వాసులకు అండ

**వరదల నేపథ్యంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు**

**రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సమన్వయ కేంద్రం**

**ఆచూకీ తెలియని వారి వివరాలు హెల్ప్‌లైన్‌కు ఇవ్వాలని సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 26:** నేపాల్‌లో తీవ్ర వరద పరిస్థితుల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోంది. అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులను గుర్తించడం, వారికి అవసరమైన సహాయాన్ని అందించడం కోసం కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం, ఇతర సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తోంది. నేపాల్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరపలేకపోతున్న వారు తెలంగాణ భవన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. సంబంధిత వ్యక్తి పేరు, పాస్-పోర్టు వివరాలు, మొబైల్ నంబర్, ప్రస్తుతం ఉన్న లేదా చివరిసారిగా తెలిసిన ప్రాంతం, టూర్ ఆపరేటర్ వివరాలతో పాటు కుటుంబ సభ్యుల సంప్రదింపు వివరాలను అందించాలని కోరింది. హెల్ప్‌లైన్‌కు వచ్చే ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యత ఆధారంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు అవసరమైన సహాయం అందేలా సమన్వయం చేస్తామని ప్రభుత్వం తెలిపింది. నేపాల్‌లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరాన్ని బట్టి మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొంది.

**హెల్ప్‌లైన్ నంబర్లు:** వందన - 9871999044, చక్రవర్తి - 9949351270, జి. రక్షిత్ నాయక్ - 9618597969.

# కోడెల మృతి కారకులపై చర్యలు తప్పవు


**గోశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించిన ఆది**



**వేములవాడ, ఆగస్ట్ 26:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ తిప్పాపూర్ గోశాలలో ఐదు కోడెలు మృతి చెందాయి. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. గోశాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గోశాలలో కోడెల సంరక్షణ, నిర్వహణపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో తిప్పాపూర్ గోశాలను బుధవారం ఆది శ్రీనివాస్ సందర్శించారు. గోశాలలో పరిస్థితులను పరిశీలించి, కోడెలకు అందుతున్న సంరక్షణ, ఆహారం, వైద్య సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా గోశాల నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. అవసరమైన మేరకు కోడెలను ఇతర ప్రాంతాలకు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు సమర్పించే నిజ కోడెలను గోశాలకు తీసుకువచ్చిన వెంటనే ప్రత్యేకంగా క్వారంటైన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చే కోడెల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాతే వాటిని ఇతర కోడెలతో కలపాలని సూచించారు. దీనివల్ల వ్యాధుల వ్యాప్తిని అరికట్టే అవకాశం ఉంటుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. అలాగే, పాలు మానేసిన కోడెలను మాత్రమే భక్తులు స్వామివారికి సమర్పించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గోశాలలో కోడెలకు మెరుగైన సంరక్షణ అందించడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. దు కోడెల మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# విదేశీయుడి ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, ఆగస్ట్ 26:** హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఓ విదేశీయుడిని సైఫాబాద్ పోలీసులు రక్షించారు. సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న సైఫాబాద్ పోలీసులు.. గమనించి తాడు సాయంతో విదేశీయుడిని రక్షించారు. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి టోలిచౌకి పారామౌంట్ కాలనీలో నివాసం ఉంటున్న సుడాన్ దేశానికి చెందిన నాజర్ ఆడమ్ బడా వేగా (25) గుర్తించారు. విచారణ నిమిత్తం లేక్ పోలీసులకు అప్పగించారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై లేక్ పోలీసులు ఆరా తీస్తున్నారు.



ఉద్యమ కెరటం
విజయ రక్షిత రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
27 ఆగస్టు 2026

# సంపాదకీయం



# 'అమెరికా ఫస్ట్'.. ఆర్థిక వ్యవస్థ లాస్ట్?

**యుద్ధాలు.. సుంకాల సమరం.. పెరుగుతున్న రుణభారం**

**ఇంధనం నుంచి నిత్యావసరాల దాకా ధరల సెగ**

**వలసలపై ఆంక్షలు.. వాణిజ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం**

**ట్రంప్ విధానాలతో మరింత పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి**

**మధ్యంతర ఎన్నికల్లో ప్రజాతీర్పు ఎలా ఉండబోతోంది?**

అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా తీర్చిదిద్దుతానంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకు తెచ్చిన 'అమెరికా ఫస్ట్' నినాదం ఇప్పుడు ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతవరకు మేలు చేస్తోందన్న చర్చ మొదలైంది. ఇరాన్‌తో యుద్ధ పరిణామాలు, వివిధ దేశాలతో అనుసరిస్తున్న ఘర్షణాత్మక వాణిజ్య విధానాలు, సుంకాల పెంపు, వలసలపై కఠిన ఆంక్షలు, భారీ జాతీయ రుణం అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, నిత్యావసరాల వ్యయం సామాన్యుల కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం ఏ దేశానికీ చౌక వ్యవహారం కాదు. ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలతో రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగినట్లే, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అమెరికాపైనా అదనపు భారం మోపుతున్నాయి. యుద్ధ వ్యయాలు ఒకవైపు పెరుగుతుండగా, మరోవైపు ఇంధన సరఫరాలు, అంతర్జాతీయ రవాణా, వాణిజ్యంపై ఏర్పడే అనిశ్చితి ధరలను ప్రభావితం చేస్తోంది. అంతిమంగా ఈ భారంలో కొంత భాగం సామాన్య వినియోగదారుడిపైనే పడుతోంది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న సుంకాల విధానం కూడా తీవ్ర చర్చకు దారితీస్తోంది. దేశీయ పరిశ్రమలను రక్షించడం, విదేశీ దిగుమతులను తగ్గించడం, అమెరికాలోనే ఉత్పత్తిని పెంచడం ఈ విధానం వెనుక ప్రకటిత లక్ష్యాలు. అయితే దిగుమతులపై భారీ సుంకాలు విధించినప్పుడు వాటి భారం చివరకు అమెరికాలోని వ్యాపార సంస్థలు, వినియోగదారులపై పడే ప్రమాదం ఉంటుంది. భారత్ సహా అనేక దేశాలతో వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు పెరిగితే ప్రపంచ సరఫరా వ్యవస్థలపైనా ప్రభావం పడుతుంది. అమెరికా మార్కెట్‌పై ఆధారపడిన దేశాలకు నష్టం కలిగినట్లే, ఆయా దేశాల నుంచి ముడిసరకులు, వస్తువులను దిగుమతి చేసుకునే అమెరికా సంస్థలకూ వ్యయభారం పెరుగుతుంది. అందుకే సుంకాల సమరం ఒకవైపు ప్రత్యర్థిని దెబ్బతీస్తే మరోవైపు సొంత ఆర్థిక వ్యవస్థకూ ఎదురుదెబ్బగా మారవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన దీర్ఘకాలిక సమస్యల్లో జాతీయ రుణం ప్రధానమైనది. ప్రభుత్వ వ్యయం పెరగడం, ఆదాయానికి మించి ఖర్చులు కొనసాగడం, పన్ను విధానాలు, రక్షణ వ్యయం, సామాజిక కార్యక్రమాల భారం కలిసి అప్పులను భారీగా పెంచుతున్నాయి. ఈ రుణంపై చెల్లించాల్సిన వడ్డీ కూడా ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై పెద్ద భారంగా మారుతోంది. వడ్డీ చెల్లింపులకే భారీ మొత్తాలను వెచ్చించాల్సి వస్తే మౌలిక వసతులు, విద్య, వైద్యం, పరిశోధన వంటి రంగాలకు అందుబాటులో ఉండే నిధులపై ఒత్తిడి పెరుగుతుంది. ఇదే పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే అప్పు తీసుకుని వడ్డీ చెల్లించే విషవలయంలోకి ఆర్థిక వ్యవస్థ వెళ్లే ప్రమాదం ఉంటుంది. అమెరికా ప్రభుత్వ బాండ్లకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వాసమే ఆ దేశానికి ఇప్పటివరకు ప్రధాన బలం. డాలర్‌కు అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా ఉన్న ప్రాధాన్యం కూడా అమెరికాకు ప్రత్యేక ప్రయోజనం కల్పిస్తోంది. అయితే భౌగోళిక రాజకీయ విభేదాలు పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని దేశాలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది వెంటనే డాలర్ ఆధిపత్యాన్ని కూలదోయకపోయినా దీర్ఘకాలంలో అమెరికా అప్రమత్తంగా ఉండాల్సిన పరిణామమే. ట్రంప్ వలస విధానాలు మరో కీలక అంశం. అక్రమ వలసలను నియంత్రించడం ప్రభుత్వ హక్కే అయినప్పటికీ, అమెరికా వ్యవసాయం, నిర్మాణం, హోటళ్లు, సేవలు సహా అనేక రంగాలు వలస కార్మికులపై ఆధారపడుతున్నాయి. ఒక్కసారిగా కార్మికుల లభ్యత తగ్గితే వేతన వ్యయం పెరిగి ఉత్పత్తి ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అత్యున్నత నైపుణ్యం కలిగిన విదేశీ విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులను ఆకర్షించడమే అమెరికా ఆవిష్కరణల రంగానికి దశాబ్దాలుగా బలంగా నిలిచింది. వలస విధానాల్లో అతికఠిన వైఖరి ఈ ప్రతిభను ఇతర దేశాల వైపు మళ్లిస్తే దీర్ఘకాలంలో అమెరికా పోటీతత్వానికే నష్టం కలగవచ్చు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పతనమైపోయిందని ఇప్పుడే తేల్చేయడం తొందరపాటు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా, సాంకేతికత, పెట్టుబడులు, పరిశోధన, ఆర్థిక మార్కెట్లలో అమెరికాకు ఇప్పటికీ అపారమైన బలం ఉంది. అయితే భారీ రుణం, వడ్డీ భారం, యుద్ధ వ్యయాలు, వాణిజ్య ఘర్షణలు, ధరల ఒత్తిడి ఒకేసారి కొనసాగితే ఆ బలమైన పునాదులపైనా ప్రభావం తప్పదు. వచ్చే నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలు ఈ నేపథ్యంలో ట్రంప్ పాలనకు కీలక రాజకీయ పరీక్షగా మారనున్నాయి. 'అమెరికా ఫస్ట్' విధానంతో దేశీయ పరిశ్రమలు, ఉద్యోగాలను రక్షించామని ట్రంప్ ప్రజలను ఒప్పించగలరా? లేక ధరల పెరుగుదల, వాణిజ్య ఉద్రిక్తతలు, యుద్ధ పరిణామాలు, ఆర్థిక అనిశ్చితిపై ఓటర్లు అసంతృప్తిని వ్యక్తం చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రపంచాన్ని సుంకాలతో శాసించడం ఒక ఎత్తయితే.. సొంత ప్రజల జీవన వ్యయాన్ని అదుపులో ఉంచడం మరో ఎత్తు. 'అమెరికా ఫస్ట్' నినాదం నిజంగా అమెరికాను ముందుకు తీసుకెళ్తుందా.. లేక ఆర్థిక భారాల మధ్య అదే నినాదం ట్రంప్‌కు రాజకీయ పరీక్షగా మారుతుందా అన్నదానికి మధ్యంతర ఎన్నికలే కీలక సమాధానం ఇవ్వనున్నాయి.

# మోహన్ భగవత్ సభపై మమ్దానీ అభ్యంతరం

- న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ కార్యక్రమంపై రాజకీయ దుమారం
- మేయర్ తీరుపై మండిపడ్డ అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్
- మోదీ, బీజేపీ వ్యతిరేకతతోనే అడ్డుకునే ప్రయత్నమని ఆరోపణ
- ఆగస్టు 29న మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో భగవత్ ప్రసంగం
- కావాలంటే సొంతంగా ర్యాలీ చేసుకోండి.. వ్యతిరేకులకు మిల్బెన్ సూచన







**న్యూయార్క్, ఆగస్టు 26:** న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొననున్న కార్యక్రమం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన వ్యాఖ్యలపై అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీపై వ్యతిరేకత కారణంగానే భగవత్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29న నిర్వహించనున్న కార్యక్రమంలో మోహన్ భగవత్ ప్రసంగించనున్నారు. అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అమెరికాలోని హిందూ సమాజాన్ని ఒక వేదికపైకి తీసుకురావడం, వివిధ అంశాలపై చర్చించడం కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. భగవత్ కార్యక్రమంపై మమ్దానీ అభ్యంతరం వ్యక్తం చేశారు. అమెరికా బహుళత్వం, లౌకిక విలువలు, అందరికీ సమాన స్థానం కల్పించే విధానాలతో ముందుకు సాగిందని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని వెలివేసే ధోరణులు పెరగడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన కార్యక్రమాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇది ప్రైవేటు కార్యక్రమం కావడంతో దానిని రద్దు చేయడానికి మేయర్‌గా తనకు చట్టపరమైన అధికారం ఉందా లేదా అన్న విషయంపై స్పష్టత లేదని కూడా మమ్దానీ పేర్కొన్నారు. మమ్దానీ వ్యాఖ్యలపై మేరీ మిల్బెన్ ఘాటుగా స్పందించారు. మోదీ, బీజేపీపై ఉన్న వ్యతిరేకతను ఆర్ఎస్ఎస్ కార్యక్రమంపై చూపుతున్నారని విమర్శించారు. ఒక ప్రైవేటు కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారు కావాలనుకుంటే నిధులు సమీకరించుకుని తమ సొంత ర్యాలీ నిర్వహించుకోవచ్చని సూచించారు. మోదీ వ్యతిరేకతతో వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న కార్యక్రమం తనకు నచ్చిందని, భారత్‌లో మత స్వేచ్ఛ తదితర అంశాలపై అర్థవంతమైన చర్చ జరగాలని కోరుకుంటున్నట్లు మిల్బెన్ తెలిపారు. మమ్దానీ అభ్యంతరాలు, మిల్బెన్ ప్రతివిమర్శలతో ఆగస్టు 29న జరగనున్న భగవత్ కార్యక్రమం ఇప్పుడు అమెరికాలోని భారతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# భారత్ ధర్మశాల కాదు!

## దేశంలో నివసించే హక్కు పౌరులకే: అమిత్ షా

**అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపాలని భద్రతా సంస్థలకు దిశానిర్దేశం**

**అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తి చేయడమే లక్ష్యమని వెల్లడి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** "భారత్ ధర్మశాల కాదు.. ఈ దేశంలో నివసించే హక్కు దేశ పౌరులకే ఉంటుంది" అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేయాల్సిందేనని అన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన జాతీయ భద్రతా వ్యూహ సదస్సు ముగింపు సమావేశంలో అమిత్ షా పాల్గొని దేశ భవిష్యత్ భద్రతా వ్యూహంపై కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లకు స్పందించడంతోనే సరిపెట్టకుండా రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో దేశ భద్రతను ప్రభావితం చేయగల పరిణామాలను ఇప్పటి నుంచే అంచనా వేయాలని భద్రతా, నిఘా సంస్థలకు సూచించారు. అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు తదితర సవాళ్లను ముందుగానే గుర్తించి అడ్డుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అక్రమ వలసలు కేవలం శాంతిభద్రతలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, దేశ ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### సరిహద్దులపై మరింత నిఘా

దేశ భూ సరిహద్దుల రక్షణను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అమిత్ షా తెలిపారు. గత ఎనిమిది నెలల్లో సరిహద్దులు కలిగిన అన్ని రాష్ట్రాలతో కేంద్రం చర్చలు జరిపిందని చెప్పారు. సరిహద్దు భద్రత కోసం నాలుగు స్తంభాలతో కూడిన వ్యవస్థను రూపొందించినట్లు వెల్లడించారు. సరిహద్దుల వద్ద అక్రమ చొరబాట్లను గుర్తించడం, వాటిని అడ్డుకోవడం, నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం, కేంద్ర--రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. "దేశ భద్రత విషయంలో రాజీకి తావులేదు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించేవారిని గుర్తించి అడ్డుకోవాలి. సాధ్యమైనంత తక్కువ సమయంలో భారత్‌ను అక్రమ చొరబాట్ల సమస్య నుంచి విముక్తి చేయడమే లక్ష్యం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యలపై పోరాడే పత్రిక

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి




**ఉద్యమ కెరటం,నేరడిగొండ :** ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న దినపత్రిక ఉద్యమ కెరటం,అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు. ఉద్యమ కెరటం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యం, సంపాదకవర్గం, పాత్రికేయులు, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, సామాజిక అంశాలపై నిర్భయంగా వార్తలను ప్రచురించడంలో ఉద్యమ కెరటం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రజల గొంతుకగా, బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల ఆదరణను పొందుతున్న పత్రికగా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఉద్యమ కెరటం మరిన్ని విజయాలను అందుకుంటూ ప్రజా పక్షపాత జర్నలిజాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# ఢిల్లీని వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ

**ఇప్పటివరకు 2,308 హెచ్1ఎన్1 కేసులు**

**మూడు వేలు దాటిన మొత్తం ఇన్‌ఫ్లుయెంజా కేసులు**

**నాలుగైదు రోజులుగా అమాంతం పెరుగుతున్న బాధితులు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశ రాజధాని ఢిల్లీని స్వైన్‌ఫ్లూ వణికిస్తోంది. నగరంలో హెచ్1ఎన్1 కేసులు వేగంగా పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఢిల్లీలో 2,308 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. మొత్తంగా వివిధ రకాల ఇన్‌ఫ్లుయెంజా కేసుల సంఖ్య మూడు వేలు దాటింది. ముఖ్యంగా గత నాలుగైదు రోజులుగా హెచ్1ఎన్1 కేసులు ఒక్కసారిగా పెరుగుతున్నట్లు సమాచారం. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో పలు ఆస్పత్రుల్లో రోగుల రద్దీ కనిపిస్తోంది. స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. హెచ్1ఎన్1 బాధితులకు ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు ప్రతి ఆస్పత్రిలో ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేఖాగుప్తా అధికారులను ఆదేశించారు. కేసుల పెరుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మందులు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అయితే ప్రస్తుతం ఢిల్లీలో వ్యాపిస్తున్న హెచ్1ఎన్1 వైరస్ కొత్త రకం కాదని భారత వైద్య పరిశోధన మండలి, ఢిల్లీ ఎయిమ్స్ వైద్య నిపుణులు పేర్కొన్నారు. ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# ఇరాన్‌పై కొత్తగా దాడులు చేయబోం

## విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడి



**వాషింగ్టన్, ఆగస్ట్ 26:** పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు ప్రస్తుతానికి ఆగినా.. యుద్ధ మేఘాలు మాత్రం తొలగిపోలేదు. ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేసేలా ఆంక్షలు విధించిన అగ్రరాజ్యం తాజాగా కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఇరాన్‌పై కొత్తగా దాడులు ఉండవని విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. మిత్రదేశాలకు ఈ విషయాన్ని తెలియజేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఇరాన్ వైపు నుంచి మళ్లీ దాడులు ప్రారంభమయితే అమెరికా సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అధికారులు వెల్లడించారు. దాడులు ఉండవని చెప్పినప్పటికీ.. ఇరాన్ ఓడరేవుల నుంచి నౌకల రాకపోకలను కట్టడిచేసేలా హర్మూజ్‌లో దిగ్బంధాన్ని అమెరికా కొనసాగిస్తోంది. మరోవైపు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచేలా కొత్త ఆంక్షలతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రో కెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల (జాం బజీనిఇబితినీనిబ నీని ఎసజీని) లక్ష్యమని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# ఆశ్రమ బాలికల పాఠశాలలో వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని లఖంపూర్ ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థినిలకు రక్తహీనత, జ్వరం, చర్మవ్యాధులు తదితర సాధారణ ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినిలకు అవసరమైన మందులను పంపిణీ చేసి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థినిలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఎ.సంతోష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, హాస్టల్ ఏఎన్ఎం అరుణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నేడు నేరడిగొండలో ఎస్ఐఆర్ పై ప్రత్యేక గ్రామసభ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై గ్రామసభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, కార్యదర్శి అరుణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభలో ప్రస్తుత ఓటర్ల జాబితాను పరిశీలించడం, అర్హత ఉన్నా పేరు లేని వారిని గుర్తించడం, మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన వారిని గుర్తించడం, ఒకే పేరు రెండు చోట్ల ఉందా అని పరిశీలించడం, పేరు, వయస్సు, లింగం, చిరునామాలో తప్పులను సరిదిద్దడం, 18 ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడం వంటి అంశాలపై చర్చించనున్నారు. అలాగే ఓటర్ల జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, బీఎల్ఓ లు, బీఎల్ఎలు పెద్ద ఎత్తున హాజరై గ్రామసభను విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఇస్లాం మత చివరి ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించుకునే మీలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను బుధవారం తాండూర్ మండలంలో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు మంగళవారం రాత్రి జాగరణతో ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. తాండూర్ మండల కేంద్రంలోని ఐబిలో మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు సోదరులు ర్యాలీలో పాల్గొని ప్రవక్త మహమ్మద్ సాహెబ్ సందేశాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూర్ సీఐ ఎన్.దేవయ్య ఆధ్వర్యంలో కన్నె పెల్లి ఎస్సై విక్రమ్, తాండూర్ ఏఎస్సై రాజమొగిలి, తాండూర్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికల జోష్

## గెర్జామ్ లో 300 మంది చేరిక

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోంది. బోథ్ నియోజకవర్గంలోని గెర్జామ్ గ్రామంలో బుధవారం భారీ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సుమారు 300 మంది యువకులు, గ్రామస్తులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర అబ్జర్వర్ రాథోడ్ బాపూరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెర్జామ్ గ్రామంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పార్టీలో చేరడం శుభపరిణామమని అన్నారు. ప్రజల ఆదరణతో తెలంగాణ రక్షణ సేన పార్టీ బోథ్ నియోజకవర్గంలో రోజురోజుకూ బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయిలో పార్టీని మరింత విస్తరించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం



కృషి చేస్తామని తెలిపారు. ఈ చేరికలతో నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ షేక్ బిలాల్, మైనారిటీ చైర్మన్ ఫరీద్, ఎండీ ఆసిఫ్, షేక్ మహమ్మద్, షేక్ ముస్తఫా, మారుతీ పటేల్, గ్రామ నాయకులు కనక లచుపటేల్, కొట్నాక్ మహదు, కొట్నాక్ లచ్చు, పెద్ది రవి, పెందుర్ ప్రభాకర్, కనక మానుకు, కనక సుంగు, మాజీ సర్పంచ్ సిదమ్ తులసిరాం, కొట్నాక్ శంకర్, కనక శ్రీనివాస్, కొట్నాక్ విశ్వనాథ్, కొట్నాక్ రమేష్, విజయ్, వసంత్, ఇస్రు, గంగారాం, హనుమంతు, పెద్ది శేఖర్, పడిగెల రమేష్, పడిగెల అనిల్, కత్తూరి ధర్మాన, నాగోరావ్, కనక రాందాస్, ధరంపూరి కొమరం జంగు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పవిత్ర మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు మహమ్మద్ మిన్హాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో పాటు ప్రజలకు మిఠాయిలు, షర్బత్‌ను పంపిణీ చేశారు. మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు.



అనంతరం బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ మిన్హాజ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో పార్టీ అత్యవసర కార్యక్రమాల కారణంగా ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ నేరుగా కార్యక్రమానికి హాజరు కాలేకపోయినప్పటికీ, సిర్పూర్ నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలియజేశారని అన్నారు. సిర్పూర్-కాగజ్‌నగర్ ప్రాంతం గంగా-జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని, అన్నివర్గాల ప్రజలు సోదరభావం, ఐక్యతతో మెలగాలని ఆకాంక్షించారు. 2028 నాటికి ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో సిర్పూర్-కాగజ్‌నగర్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనార్టీలతో పాటు అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలనే డిమాండ్‌తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగనుంది. ఈనెల 27న తల్లాడలో ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభం కానుంది. తల్లాడ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర ఉదయం 11.30 గంటలకు కల్లూరు చేరుకోనుంది. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు పెనుబల్లి, మధ్యాహ్నం 2.30 గంటలకు వేంసూరు, సాయంత్రం 3.30గంటలకు సత్తుపల్లికి చేరుకోనుంది. సత్తుపల్లిలో నియోజకవర్గ కేంద్రానికి పాదయాత్ర చేరుకున్న అనంతరం కార్యక్రమం ముగియనుంది. ఈ పాదయాత్రలో తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయ సంఘాల ప్రతినిధులు పాల్గొని జర్నలిస్టుల డిమాండ్లకు సంఘీభావం తెలపాలని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా ఉద్యమం కొనసాగిస్తామని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పేర్కొన్నారు. "జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం– ప్రజల గొంతుక కోసం నిరంతర ఉద్యమం" అనే నినాదంతో పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గౌడ యువజన సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** తెలంగాణ గౌడ యువజన సంఘం గంభీరావుపేట మండల నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ సూచనల మేరకు జిల్లా యువజన గౌడ సంఘం అధ్యక్షులు అబ్బసాని సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండల నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా బుధవారం నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులను జిల్లా యువజన గౌడ సంఘం అధ్యక్షులు అబ్బసాని సందీప్ గౌడ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం గౌడ యువతను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు, సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షులుగా గొల్లపల్లి నరేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా గుర్రం రాజు గౌడ్ (కొత్తపల్లి), కుషిగుంపుల సురేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆశయ్యగారి నవీన్ గౌడ్ తో పాటు పలువురు కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి ఆశయ్యగారి చంద్రశేఖర్ గౌడ్‌తో పాటు పలువురు గౌడ యువకులు, సంఘం నాయకులు, నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఏర్పాటుతో



గంభీరావుపేట మండలంలో గౌడ యువజన సంఘం మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

- మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు హమీద్

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసెల గూడెం కాలనీలో బరిగెల రాజు–కళ్యాణి దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు హమీద్ ముఖ్య అతిథిగా హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం గూడు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేద ప్రజల కళ్లల్లో ఆనందాన్ని చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహ అవసరాలకు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు వేషాల వెంకటి, నాంపల్లి గంధపు శంకర్, బంటు ప్రసాద్, ఎడబోయిన శ్యామ్, దోసెల రామచంద్రం, మద్దెల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ విమర్శించారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని హాస్పిటల్‌లో కార్మికులతో కలిసి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 'వ్యాపారం సులభతరం' పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎస్పీఎంలో గుర్తింపు పొందిన కార్మిక సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, పాత కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాగజ్‌నగర్ హాస్పిటల్‌ను వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్‌తో పాటు దేశ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, నాయకులు శివమ్, సాయి, మీనాక్షి, రాజేష్, పుష్పలత, తిరుమల, శారద తదితరులు పాల్గొన్నారు.

# విరాహత్ అలీని పరామర్శించిన పలువురు ప్రముఖులు





**ఉద్యమ కెరటం, హైదరాబాద్ :**
ఇటీవల మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీని బుధవారం రోజు గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు కలిసి పరామర్శించారు. ఎమ్మెల్సీ కోదండరాం, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్, జనంసాక్షి పత్రిక సంపాదకులు ఎం.ఎం.రెహమాన్, ప్రజా గాయకులు ఏపూరి సోమన్న,ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ( ఐజేయు ) జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మహా న్యూస్ ఛానెల్ ఎడిటర్ అజిత, టీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకురాలు, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా విభాగం కన్వీనర్ కళ్యాణం రాజేశ్వరీ, హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీస్ జేఏసీ నాయకులు సూరజ్, గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవి, తెలంగాణ సర్జన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ లింగం, టీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వెలిజాల చంద్రశేఖర్, వరంగల్ సీనియర్ పాత్రికేయులు కొండల్ రావు, రజినీకాంత్ లతో పాటు ఆయా జిల్లాలకు చెందిన జర్నలిస్టులు విరాహత్ అలీని పరామర్శించి ఓదార్చారు.

# విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- **ఘనంగా ఎస్టీయూటీఎస్ 80వ వసంతాల వైభవోత్సవం**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్టీయూటీఎస్) 80వ వసంతాల వైభవోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషి తెలంగాణ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశ భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్ స్థాయికి చేరుకోవడంలో తన గురువుల బోధనలు, వారు నేర్పిన విలువలు ఎంతో ప్రభావం చూపాయని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని, విద్యార్థుల భవిష్యత్తుకు శిల్పులని అన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం ఎస్టీయూటీఎస్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకారం అందిస్తూ ముందుండి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డ్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** రాఘుపూర్ జిపి కేంద్రంలో బుధవారం కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆత్రం విజయలక్ష్మి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి కోట బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చక్కటి లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి అశోక్, కారోబారి చిక్రం రాజు, గ్రామ పటేల్ కోవ విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాల్లో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పట్టణంలోని తిర్పెల్లి, మావల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పలు నూతన గృహప్రవేశాలు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు, ఇందిరమ్మ ఇళ్లు పొందిన కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ నిషిద ఆదిత్య కండేష్కర్, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, అట్ల గోవర్ధన్ రెడ్డి, రెండ్ల రాజన్న, మోసిన్, సునీల్, రొడ్డ ప్రదీప్, అలీమ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న డీసీఎం వ్యాన్

## క్యాబిన్లో ఇరుక్కుని వ్యాన్ డ్రైవర్ మృతి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని కందిమల్ల వారి బంజర దగ్గర గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై అర్ధరాత్రి సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వియం బంజర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. అనంతరం అతడిని బయటకు తీసి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడిని మహారాష్ట్రకు చెందిన నవనీత్ మరాటిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మ దిన వేడుకలు





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో ఈద్ మిలాదున్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి, ఆకుపచ్చ కండువాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చేతుల్లో 'లవ్ ముహమ్మద్' సందేశాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను చాటిచెప్పారు. వేడుకల్లో భాగంగా ముస్లిం సోదరులు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పరస్పరం మిలాద్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. మత సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వమే ప్రవక్త సందేశమని, ఆయన బోధనలు సమాజానికి మార్గదర్శకమని పలువురు పేర్కొన్నారు.

# చేవెళ్లలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా చేవెళ్ల నియోజకవర్గంలో బుధవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి నియామక సమన్వయ కర్తగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. కర్ణాటక శాసనమండలి సభ్యుడు, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సి.వి.మోహన్ పరిశీలకుడిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకులుగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, భారతీయ రెడ్‌క్రాస్ సంఘం రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యులు ఈవి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, విద్యార్థి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ విభాగం, ఎస్టీ విభాగం నాయకులతో పాటు జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. నూతన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లగల సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేయడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా చేవెళ్ల నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్ఠానానికి సమగ్ర నివేదిక అందించనున్నట్లు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే నాయకత్వం అవసరమని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

# ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** పవిత్ర మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో పాటు ప్రజలకు మిఠాయిలు, షర్బత్ పంపిణీ చేశారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ తాహేర్




DISTRICT CONGRESS COMMITTEE
RAJANNA SIRCILLA
Near Konda Laxman Bapuji Circle, Bypass Road, Vidyanagar, Rajanna Sircilla Dist. Head Quarters
SANGEETHAM SRINIVAS
President
Date: 25-08-2026

The following names are appointed as GAMBHERAOPET MANDAL Committee

| Sl.No. | Name | Position |
|---|---|---|
| 01 | JOGU SURESH | Vice President |
| 02 | ERRA KISHAN GOUD | Vice President |
| 03 | BANGLA RAJU GOUD | General Secretary |
| 04 | MD TAHIR | General Secretary |
| 05 | SK TAJODDIN | General Secretary |
| 06 | ELLY BALAKISHAN | General Secretary |
| 07 | TEKUMALLA PRAVEEN | Secretary |
| 08 | SHANIGARAPU NARESH VARM | Secretary |
| 09 | YATYUR RENUKA | Secretary |
| 10 | GURAM RAJU | Secretary |
| 11 | GADHYA SRIJA | Secretary |
| 12 | ERGI PARSHARAMULU | Secretary |
| 13 | MUGULALA RAMCHNDRAM | Executive Member |
| 14 | MOHAMMD HASIN | Executive Member |
| 15 | RAGULA ANJI REDDY | Executive Member |
| 16 | GUNDLLOTHU KALYANI | Executive Member |
| 17 | RAJBOEENA NAGAIAH | Executive Member |
| 18 | KOMATI BAGYA | Executive Member |
| 19 | PEDHAVENI MALAIAH | Executive Member |
| 20 | JOGU CHANDU | Executive Member |
| 21 | MOTHE LATHA | Executive Member |

SANGEETHAM SRINIVAS
President

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ తాహేర్ ఎన్నికయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయనను మండల ప్రధాన కార్యదర్శి పదవికి నియమించింది. ఈ సందర్భంగా మహమ్మద్ తాహేర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మండలంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయన ఎన్నిక పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఆదిలాబాద్ లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు అత్యంత బుధవారం భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ శోభాయాత్ర వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, సీనియర్ నాయకులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ మిలాద్ ఉన్ నబీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు, ఆయన చూపిన శాంతి, కరుణ, సోదరభావం మార్గం మానవాళికి ఎల్లప్పుడూ ఆదర్శనీయమని కొనియాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ శాంతియుతంగా, కలిసిమెలిసి జీవించినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గంగా-జమునా తెహజీబ్ సంస్కృతిని కాపాడుకుంటూ, అన్నివర్గాల ప్రజలు ఇలాగే ఐక్యమత్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ ర్యాలీలో పలువురు సీనియర్ నాయకులు, మైనారిటీ ప్రముఖులు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ వీధుల గుండా సాగిన ఈ ప్రదర్శనలో ప్రవక్తను స్మరిస్తూ సాగిన నినాదాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింభించింది.

# ప్రవక్త సందేశం విశ్వశాంతికి మార్గం

## ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని పిలుపు





- **జిల్లా వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు**

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ :**
ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం మీలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని జామా మస్జిద్ నుండి ప్రారంభమైన జులూస్ (శాంతి ర్యాలీ) వివేకానంద చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, ఖదీమ్ మస్జిద్ మీదుగా ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. అనంతరం జామా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా జనకాపూర్ లోని మస్జిదే యాసీన్ నుండి పలు వీధుల గుండా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వ సందేశాన్ని అందించారని, ఆయన చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, వార్డ్ సభ్యుడు గులాం జావిద్ , ముస్లిం నాయకులు, ప్రతినిధులు షబ్బీర్, సయ్యద్ జావిద్, శంషాద్ హుస్సేన్, సాజిద్, సయ్యద్ నిసార్,అమర్, తారీక్, ఇమ్రాన్, షాహిద్ హుస్సేన్, తాజ్, మహమ్మద్ జాఫర్ సాదిక్ హుస్సేన్, రైస్ అహ్మద్ , ముబాషిర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం పట్ల వెంకటాపూర్ గ్రామస్తుల హర్షం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో మారుమూల గ్రామమైన వెంకటాపూర్ గ్రామానికి ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. గత కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, వృద్ధులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యాన్ని మంజూరు చేయించారు. ప్రస్తుతం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా బస్సు రాకపోకలు కొనసాగుతున్నాయి. బస్సు సౌకర్యం కల్పించినందుకు గ్రామస్తుల తరపున ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా సహకరించిన డిపో మేనేజర్ పండరిని గ్రామస్తులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ పెద్దలు ఆడే గంగారాం నాయక్, రూప్లా కారోభారి, శ్రీరామ్, అరవింద్, రంగారావు, కృష్ణ, మాస్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థాపకులు హార్డికర్ వర్ధంతి

**ఉద్యమ కెరటం, తాండూర్:** భారత కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్ఎస్ హార్డికర్ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాదళ్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాండూర్ సేవాదళ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇందూరి గట్టయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, ఉపాధ్యక్షుడు మోమిన్ అలీ, ప్రధాన కార్యదర్శి కట్కాల మల్లేష్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ పెద్దబోయిన రవీందర్, పెద్దబోయిన రాజేశం, కామెర ప్రణీత్, మేడి శంకర్ లు పాల్గొన్నారు.






# నిషేధానికి గురైన తొలి తెలుగు చిత్రం 'రైతుబిడ్డ'

## 1939 ఆగస్టు 27న విడుదలైన సినిమా

తెలుగు సినిమా చరిత్రలో ప్రభుత్వం ఆంక్షలకు, నిషేధానికి గురైన మొట్ట మొదటి చిత్రం 'రైతుబిడ్డ'. ఆ రోజుల్లో జమీందారీ వ్యవస్థకూ, విధానాలకూ వ్యతి రేకంగా ఈ చిత్రం చేయడం ఒక రకంగా పెద్ద సాహసమే. ఈ చిత్రంలో జమీందార్ల దౌర్జన్యాలను కళ్ళకు కట్టినట్టుగా చూపించారు గూడవల్లి రామబ్రహ్మం. ఆనాటి జమీందారీ గ్రామాలలో సన్న కారు రైతులు అనుభవిస్తున్న కడ గండ్లను, జమీందారుల అకృత్యాలను, ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించాలని, ఈ విషయంలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా తట్టుకుని నిలబడాలని రామబ్రహ్మం ధృఢ నిశ్చయం చేసు కున్నారు. ఈ వాస్తవాన్ని జీర్ణించు కోలేని జమీందారులు ఆగ్రహించి, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి చివరికి ఆయా జమీందార్ల ప్రోద్బలంతో నిషేధింప చేశారు. బొబ్బిలి రాజా, వెంకటగిరి రాజా సినిమా నిర్మాత మీద పరువు నష్టం దావా వేస్తామని బెదిరించారు. తెలుగు చలన చిత్రాల్లోని కథా గమనానికి కొత్త స్ఫూర్తినిచ్చిన ఈ చిత్రంను లక్ష రూపాయలకు పైగా వ్యయంతో మద్రాసులోని ఎం.పి.పి.సి. స్టూడియో ప్రాంతంలో నిర్మించి 27-8-1939న విడుదల చేశారు. 'గూడవల్లి రామబ్రహ్మం... 'దున్నే వాడిదే భూమి', 'జమీందారీ విధానాలు పోవాలి' లాంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 'రైతుబిడ్డ' కథ సిద్ధం చేశారు. తాపీ ధర్మారావు నాయుడు, త్రిపురనేని గోపీచంద్ తో కలిసి 'రైతుబిడ్డ'కు మాటలు రాశారు. కొన్ని పాటలను తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచార్య రాశారు. మల్లాది విశ్వనాధ కవిరాజు హాస్య సంభాషణలు సమ కుర్చారు. అప్పటికే రైతు ఉద్యమం మీద పాటలు రాసిన కొసరాజు రాఘవయ్య చౌదరిని రైతు ప్రతినిధి రామిరెడ్డి పాత్రకు ఎంపిక చేశారు. ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, నెల్లూరు. ''జమీన్ రైతు' వార పత్రిక స్థాపకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు గేయాలను, తుమ్మల సీతా రామమూర్తి పద్యాలను కూడా ఈ చిత్రంలో రామబ్రహ్మం వినియోగించు కున్నారు. కథానాయకుడైన రైతు పెద్ద నర్సిరెడ్డి పాత్రకు బళ్ళారి రాఘవను ఎంపిక చేసుకున్నారు. ఆయన భార్య పాత్రకు ప్రముఖ రంగస్థల నటి కొమ్మూరి పద్మావతి దేవి ఎంపికయ్యారు. ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు సోదరుని కుమార్తె 14 ఏళ్ల టంగుటూరి సూర్య కుమారిని రైతు కుమార్తె పాత్రకు తీసుకున్నారు. 1939 ఆగస్టు 27న 'రైతుబిడ్డ' ఆంధ్ర దేశంలో 11 కేంద్రాల్లో విడుదలైంది. అంతకు ముందే ఆ చిత్ర ప్రదర్శనను ఆపు చేయిం చాలని కొంత మంది జమీందార్లు న్యాయస్థానం ద్వారా 'స్టే ఆర్డర్' జారీ చేయించారు. కానీ, అప్పటికే సెన్సార్ బోర్డు వారు ఆ సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వడంతో సినిమా విడుదలకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. వెంకటగిరి జమీందార్లు. 'రైతుబిడ్డ' చిత్రం ప్రింట్లు కొన్నింటిని తగలబెట్టించి ప్రదర్శనలను ఆపు చేయించడానికి ప్రయత్నిం చడంతో అల్లర్లు చోటు చేసుకున్నాయి. జమీందారీ వ్యవస్థలను రద్దు చేయాలని ప్రభుత్వం బిల్లు పెట్టిన కొన్నేళ్లకు ముందే రామబ్రహ్మం 'రైతు బిడ్డ'ను తీసి దర్శకుడిగా తానెంత ముందు చూపు గల వాడినో నిరూపించు కున్నారు. అందుకే మదరాసు అసెంబ్లీలో టంగుటూరి ప్రకాశంగా బిల్లు ప్రవేశ పెట్టడానికి 'రైతు బిడ్డ' సినిమా ఎంత గానో తోడ్పడిందని అప్పట్లో చెప్పుకునేవారు. 'మాలపిల్ల' సినిమాతో తెలుగు సినిమా సంగీతాన్ని ఒక మలుపు తిప్పిన భీమవరపు నరసింహారావు 'రైతుబిడ్డ'తో మరోసారి తన సత్తా చాటుకున్నారు. అలాగే జమీందారు అనుచరుడిగా రైతులను పీడించే ఖాసా సుబ్బన్న పాత్రలో ఆయన నటించారు. కొసరాజు పాటలు రాసి, నటుడుగా కూడా ఆయనకు తన పాత్రకు సంబంధించిన పాటలను తానే పాడుకున్నారు. బళ్లారి రాఘవ కీర్తిని మరింత పెంచింది ఈ సినిమా. ప్రసిద్ధ నృత్య దర్శకుడు వేదాంతం రాఘవయ్య ఈ చిత్రానికి నృత్య సారథ్యం వహించడమే కాక, దశావతార నృత్య సన్నివేశంలో నటించారు కూడా. గూడవల్లి రామబ్రహ్మం కూడా ఈ చిత్రంలో పత్రికా సంపాదకునిగా నటించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ మాగోఖలే ఈ సినిమా ద్వారానే ప్రవేశిం చారు. మద్రాసు ప్రావిన్స్ ప్రధాన మంత్రిగా వున్న (1930-32) బొల్లిని ముని స్వామి నాయుడికి ఈ చిత్రాన్ని అంకిత మిచ్చారు. ఆయన రైతు పరిరక్షణకు తనవంతు సహాయ సహకారాలు అంద జేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అజరామరాలు.. ముకేష్ పాటలు

## నేడు హిందీ సినీ గాయకుడు ముకేష్ వర్ధంతి



ముకేష్ చంద్ మాథుర్ అంటే ఎవరు అని అడిగితే, భారత దేశంలో దాదాపు దేశ ప్రజలు తెలియదనే అంటారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు ముకేష్ పేరు తెలియని వారు దాదాపు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హిందీ సినీ గాయకునిగా సుపరిచితుడైన ముకేష్ పూర్తి పేరు ముకేష్ చంద్ మాథుర్ అంటే ఔనా అనే వారే తప్ప ఔను అనే వారు బహు అరుదుగా వుంటారు.

హిందే సినీ సంగీతానికి మరపురాని మధుర గీతాలను అందించిన విలక్షణ గాయకుడు ముఖేష్. అతి పిన్న వయసులోనే లోకం వదిలి వెళ్లినా, జీవిత చరమాంకం వరకు ముఖేష్ పాడుతూనే వున్నారు. భౌతికంగా దూరమైనా, ఆయన పాడిన పాటలు అజరామరాలై, సంగీత ప్రియుల నోళ్ళలో దశాబ్దాలుగా నానుతూనే ఉన్నాయి.

ముకేష్ (జూలై 22, 1923 - ఆగస్టు 27, 1976) 1950 నుండి 1970 ల మధ్యకాలంలో భారతీయ హిందీ సినిమా రంగం నేపథ్య ప్రముఖ గాయకుడు. ముకేష్, కొద్ది పాటలు పాడినా, నేటికినీ మరపురాని గాయకునిగా చిరస్మరణీయుడు. ఆయన పాటలు ఎన్నిసార్లు విన్నా, విసుగు రాకుండా ప్రతి సారీ ఆయన గాత్రంలో లీనం అవుతుండ డాన్ని బట్టి ముఖేష్ ప్రత్యేకత స్పష్టం అవుతున్నది.

జూలై 22, 1923న ఢిల్లీ నగరంలో జోరవర్ చాంద్ మాథుర్, చంద్రాణి దంపతులకు ఆరవ సంతానంగా జన్మించారు. తండ్రి ఇంజనీరుగా ఉద్యోగం చేసేవారు. ముఖేష్ అక్క సుందర్ ప్యారికి సంగీతం నేర్పేందుకు ఒక పండిట్ వారి ఇంటికి వచ్చేవారు. దూరంగా ఉన్న గదిలో కూర్చొని ముఖేష్ ఆ సంగీత పండితుడు తన అక్కకు సంగీతం ఎలా నేర్పిస్తున్నారో శ్రద్ధగా గమనిస్తూ తనలో తనే పాడుకుంటూ ఉండేవారు. అలా సంగీతం పట్ల ముఖేష్‌కు అభిమానం ఏర్పడింది. మెట్రిక్యులేషన్ పూర్తి కాగానే కాలేజి చదువుకు వెళ్లకుండా ప్రభుత్వ నిర్మాణ శాఖలో ఉద్యోగంలో చేశారు. వుద్యోగం చేస్తూనే తన సంగీతాభిరుచికి మెరుగులు దిద్దుకునే ప్రయత్నం చేశారు. హార్మోనియం వంటి కొన్ని వాద్య పరికరాలను ఎలా వాయించాలో శిక్షణ తీసుకున్నారు. ముకేష్ దూరపు బంధువు, సినీ నటుడు మోతిలాల్‌కు ముఖేష్ స్వరం కొత్తగా, వినూత్నంగా తోచింది. తండ్రి అనుమతితో ముఖేష్‌ను బొంబాయి తీసుకెళ్లి పండిట్ జగన్నాథ్ ప్రసాద్ వద్ద సంగీత పాఠాలు నేర్పించారు. ఆ సంగీత పండిట్ వద్దకు హిందీ సినిమా పరిశ్రమకు చెందిన వాళ్లు వచ్చిపోతూ వుండేవారు. దర్శకుడు వీరేంద్ర దేశాయ్ ముఖేష్‌ను చూసి 1941లో 'నిర్దోష్' అనే సినిమాలో హీరోగా పరిచయం చేశాడు. ముఖేష్ సరసన నళిని జయవంత్ హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమాలో ముఖేష్‌ది ఒక గాయకుడి పాత్ర. నీలకంఠ తివారి పాట రాయగా, అశోక్ ఘోష్ స్వరపరచిన 'దిల్ హి బుఝా హువా హో తో ఫసి-యే-బహార్ క్యా' అనే పాటను ముఖేష్ తొలిసారి పాడారు. రెండవ సినిమా వి.సి. దేశాయ్ నిర్మించిన 'ఆదాబ్ అర్'లో కూడా నళిని జయవంత్ సరసనే హీరోగా ముఖేష్ నటించారు. తర్వాత రామ్ దర్యాని దర్శకత్వంలో వచ్చిన 'దుఃఖ్ సుఖ్' (1942) సినిమాలో హీరోగా సితారాదేవి సరసన నటించారు. ఖేమ్ చంద్ ప్రకాష్ సంగీత దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సితారాదేవితో కలిసి రెండు యుగళ గీతాలు పాడారు. 'అబ్ దేర్ న కర్ సాజన్ ఫూలోం సే జో మిల్నా హై, మేరీ అటరియా పే ఆజావో పరదేశి పంఛీ' అనే ఈ రెండు పాటలు పాపులర్ అయ్యాయి. రాజకపూర్‌తో సాన్నిహిత్యం పెరిగిన తర్వాత 'ఆహ్' సినిమాలో క్యారేజ్ డ్రైవర్‌గా ముఖేష్ ఒక అతిథి పాత్రలో కనిపించారు. తర్వాత ముఖేష్ నేపథ్య గాయకుడిగా స్థిరపడాలని నిర్ణయించుకొని ఆ దిశగా అడుగులు వేశారు. గాయక నటుడు కె.ఎల్.సైగల్‌కు ముఖేష్ వీరాభిమాని. నేపథ్య గాయకుడుగా పరిచయమైన తొలిరోజుల్లో సైగల్ పంథాను ముఖేష్ అనుకరించే ప్రయత్నం చేసేవారు. నిజానికి సైగల్ ముఖేష్ పాడిన 'దిల్ జల్తా హై' పాటను విని ఆ కొత్త గళాన్ని హిందీ చిత్రసీమకు దొరికిన ఆణిముత్యంగా శ్లాఘించారు. దిలీప్ కుమార్ మహమ్మద్ రఫీని నేపథ్య గాయకుడుగా ఇష్టపడితే, ముఖేష్ రాజ్‌కపూర్‌కు ఆస్థాన గాయకుడయ్యారు. తోటి గాయకుల గళాలతో పోలిస్తే ముకేష్ గొంతుక ప్రత్యేకంగా వుంటుంది. ఆ ప్రత్యేకత అభిమానుల్ని ఆకట్టుకుని మైమరపించే సమ్మోహన అస్త్రంగా మారింది.





నేపథ్య గాయకుడిగా శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో ముఖేష్ 133 పాటలు పాడితే, కళ్యాన్ జీ ఆనంద్ జీ ఆధ్వర్యంలో 99 పాటలు పాడారు. ముఖేష్ గెలుచుకున్న నాలుగు ఫిలింఫేర్ బహుమతుల్లో మూడు సినిమాలకు శంకర్ జైకిషనే సంగీత దర్శకులు కావడం విశేషం. అవి 'సబ్ కుచ్ సీఖా హమ్ నే' (అనారి -రాజకపూర్), 'సబ్ సే బడా నాదాన్ వహీ హై' (పెహచాన్ -- మనోజ్ కుమార్), 'జై బోలో బేయిమాన్ కి' (బేయిమాన్- మనోజ్ కుమార్), 'కభీ కభీ మేరె దిల్ మే ఖయాల్ ఆతా హై' (కభీ కభీ - అమితాబ్ బచన్) పాటలు. 1974లో సలీల్ చౌదరి సంగీతం సమకూర్చిన 'రజనీగంధ' సినిమాలో ముఖేష్ పాడిన 'కహి బార్ యూ హి దేఖా హై' పాటకు జాతీయ బహుమతి లభించింది. ముఖేష్ మొత్తం మీద 1300 పాటలు పాడారు. ఒక నాటి మేటి క్రికెటర్లు భగవత్ సుబ్రహ్మణ్య (బి.ఎస్) చంద్రశేఖర్ , సునీల్ మనోహర్ గవాస్కర్, సయ్యద్ కిర్మాణి, గుండప్ప విశ్వనాథ్‌లకు ముఖేష్ పాటలంటే ఎంతో ఇష్టం. డ్రెస్సింగ్ రూమ్‌లో స్ఫూర్తి పొందాలని వాళ్లు ముఖేష్ పాటలు లో గొంతుకలలో హమ్ చేసేవారు.

అమెరికా పర్యటనలో వుండగా ముఖేష్‌కు గుండెనొప్పి వచ్చింది. డెట్రాయిట్ (మిచిగన్ రాష్ట్రం)లోని హోటల్ రూమ్‌లో ముఖేష్ తన 53వ (27 ఆగస్టు 1976) ఏట అసువులు బాశారు. "ముఖేష్ భయ్యాకు వచ్చిన మంచి పాటలు నాకు రాలేదు. ఆయన యెంత అదృష్టవంతుడో" అని కిషోర్ కుమార్ ఓ సందర్భంలో అన్నాడట. ముకేష్ అంటే రాజ్ కపూర్, రాజ్ కపూర్ అంటే ముకేష్ గా సాగింది వాళ్లిద్దరి అనుబంధం. అందుకే ముకేష్ మరణంతో, రాజకపూర్... 'నా గొంతు మూగవోయింది. నా ఆరో ప్రాణం గంగలో కలిసింది' అంటూ రోదించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కృషితో రికార్డుల శిఖరాగ్రం : బ్రాడ్‌మన్ క్రికెట్ ప్రస్థానం

### కాలం కరిగినా కరగని కీర్తి

### బ్యాటింగ్ డాన్ బ్రాడ్‌మన్

### నేడు బ్రాడ్‌మన్ జయంతి

క్రికెట్ సామ్రాజ్యంలో ఎందరో మహారథులు ఉదయించారు, తమ అసమాన ప్రతిభాపాటవాలతో సమకాలాన్ని శాసించారు, సరికొత్త రికార్డుల శిఖరాలను అధిరోహించారు. అయితే కేవలం మైదానానికే పరిమితం కాకుండా, క్రికెట్ గణాంకాలనే తన పరాక్రమానికి శాశ్వత శిలాశాసనాలుగా మలిచిన ఏకైక యుగపురుషుడు సర్ డోనాల్డ్ జార్జ్ బ్రాడ్‌మన్. 1908 ఆగస్టు 27న ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌లోని కూటముంద్రా అనే కుగ్రామంలో జన్మించి, 2001 ఫిబ్రవరి 25న అడిలైడ్‌లో 92 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచిన ఈ క్రీడా తపస్వి జీవితం ప్రపంచ క్రీడా వినీలాకాశంలో ఒక ధ్రువతార. తెలుగులో "కృషితో నాస్తి దుర్భిక్షం" అంటారు; బ్రాడ్‌మన్ బాల్య ప్రస్థానం ఈ సూక్తికి అక్షర సత్యం. ఆధునిక సౌకర్యాలు, శిక్షణా శిబిరాలు, సాంకేతిక హంగులు మృగ్యమైన ఆ రోజుల్లో ఒక చిన్న గోల్ఫ్ బంతిని నీళ్ల ట్యాంకు ఇటుకల గోడకు కొడుతూ, చేతిలోని స్టంప్‌తో తిరిగి కొట్టే నిరంతర సాధనతో తన కంటి-చేతి సమన్వయాన్ని అమోఘంగా తీర్చిదిద్దు కున్నాడు. పందొమ్మిదేళ్ల ప్రాయంలోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసి సెంచరీతో శుభారంభం పలికిన ఈ విస్మయ కిశోరం, 1928 నవంబర్ 30న ఇంగ్లాండ్‌పై అంతర్జాతీయ టెస్టు వేదికపై అడుగు పెట్టాడు.

బ్రాడ్‌మన్ కేవలం బంతిని బలంగా బాదే బ్యాటర్ కాదు; అద్భుతమైన పాదచలనం, బంతి దిశను ముందే పసిగట్టే అతీంద్రియ దృష్టి, ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనూ చెక్కుచెదరని ఏకాగ్రత ఆయన అసలు సిసలైన ఆయుధాలు. 1930 నాటి ఇంగ్లాండ్ పర్యటనలో ఆయన ప్రదర్శించిన విశ్వరూపం క్రికెట్ చరిత్రలోనే అపూర్వం. ఆ ఒక్క సిరీస్‌లోనే 139.14 సగటుతో 974 పరుగులు సాధించడమే కాక, లీడ్స్ మైదానంలో ఒకే రోజు 309 పరుగులు చేసి, మొత్తం 334 పరుగులతో నాటి అత్యధిక వ్యక్తిగత స్కోరు



రికార్డును నెలకొల్పాడు. బ్రాడ్‌మన్ పరుగుల ప్రవాహాన్ని సాధారణ పద్ధతుల్లో ఆపలేమని గ్రహించిన ఇంగ్లాండ్ సారథి డగ్లస్ జార్డిన్ 1932-33 యాషెస్ సిరీస్‌లో కుట్రపూరితమైన 'బాడీలైన్' వ్యూహానికి తెరలేపాడు. బ్యాటర్ ప్రాణాలను, శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని హెరాల్డ్ లార్‌వుడ్ వంటి ఫాస్ట్ బౌలర్లతో భయంకరమైన బౌన్సర్లను సంధించినప్పటికీ, ఆ ప్రాణాంతక దాడిని సైతం ధైర్యంగా ఎదుర్కొని 56.57 సగటును నిలబెట్టుకున్న బ్రాడ్‌మన్ పరాక్రమం ఆయన అసమాన ధీరత్వానికి తార్కాణం. తదనంతరం 1934లో మళ్లీ లీడ్స్‌లోనే 304 పరుగులు చేసి రెండు ట్రిపుల్ సెంచరీలు బాదిన అరుదైన యోధుడిగా చరిత్రకెక్కాడు.

రెండో ప్రపంచ యుద్ధ విలయం కారణంగా అత్యున్నత ఫామ్‌లో ఉన్న తన కెరీర్‌లోని విలువైన ఆరేళ్ల కాలాన్ని కోల్పోయినప్పటికీ, యుద్ధానంతరం తిరిగి బ్యాట్ పట్టినప్పుడు ఆయన పరుగుల దాహం ఏమాత్రం తగ్గలేదు. 1948లో తన నాయకత్వంలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా జట్టు 'ది ఇన్విన్సిబుల్స్'గా అవతరించింది. అయితే, అదే పర్యటనలో ఓవల్ మైదానంలో జరిగిన చివరి టెస్టు ఇన్నింగ్స్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత భావోద్వేగభరితమైన మానవీయ ఘట్టంగా నిలిచింది. తన టెస్టు కెరీర్ బ్యాటింగ్ సగటును పరిపూర్ణమైన 100 మార్కుకు చేర్చడానికి చివరి మ్యాచ్‌లో కేవలం 4 పరుగులు అవసరమైన తరుణంలో, ఎరిక్ హోలీస్ వేసిన గూగ్లీకి డకౌట్‌గా వెనుదిరిగి 99.94 వద్దే ఆగిపోయాడు. ఆ నాలుగు పరుగుల కొరత ఒక మానవీయ విషాద సౌందర్యమై, దేవతల వంటి ప్రతిభకు కూడా ఒక సున్నితమైన సరిహద్దు ఉంటుందని చాటింది.

గణాంకాల పరంగా చూస్తే కేవలం 52 టెస్టుల్లో 80 ఇన్నింగ్స్‌లలో 6,996 పరుగులు, 29 శతకాలు (అందులో 12 ద్విశతకాలు, 2 త్రిశతకాలు), 13 అర్ధశతకాలు నమోదు చేసి దాదాపు ప్రతి మూడు ఇన్నింగ్స్‌లకొక సెంచరీ కొట్టిన అద్భుతం బ్రాడ్‌మన్ సొంతం. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 234 మ్యాచ్‌ల్లో 95.14 సగటుతో 117 సెంచరీలు, 28,067 పరుగులు సాధించి, క్వీన్స్‌లాండ్‌పై అజేయంగా 452 పరుగులు బాదిన ఆయన రికార్డులు కనీవినీ ఎరుగనివి. హెల్మెట్లు, మోచేతి గార్డులు, ఆధునిక పిచ్ కవరింగ్‌లు, అత్యాధునిక వీడియో విశ్లేషణలు లేని ఆ కాలంలో ఈ ఘనత సాధించడం ఆయనను మానవాతీత స్థాయికి చేర్చింది. 1949లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు 'నైట్‌హుడ్' (సర్) బిరుదునిచ్చి సత్కరించగా, 2000లో విజ్డెన్ శతాబ్దపు అగ్రగణ్యుడిగా ఎంపిక చేసింది. వేమన చెప్పినట్లుగా తన జన్మను ఉత్కృష్టంగా మలచుకుని, "కాలం కరిగినా కీర్తి కరగదు" అనే లోకోక్తికి సజీవ రూపమై నిలిచిన సర్ డోనాల్డ్ బ్రాడ్‌మన్, క్రికెట్ బంతి తిరిగినంత కాలం ప్రపంచ క్రీడా జగత్తులో అజరామర అధ్యాయంగా చిరంజీవిగా వెలుగొందుతూనే ఉంటాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# గెలుపు ముంగిట భారత్!

- తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 290
- ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక
- 16 పరుగుల ఆధిక్యంలో శ్రీలంక
- సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్



శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ఆసియా గేమ్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

## సెప్టెంబర్ 18న టీమ్ఇండియా మహిళలు మొదటి మ్యాచ్



2026 ఆసియా గేమ్స్? నుంచి అదిరే అప్డేట్ వచ్చింది. జపాన్ వేదికగా జరగనున్న ఈ గేమ్స్?లో క్రికెట్ పోటీలకు సంబంధించిన షెడ్యూల్? విడుదలైంది. ముందుగా మహిళల జట్ల మధ్య పోటీలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత పురుషుల కాంపిటీషన్ ఉండనుంది. ఈ మ్యాచ్?లన్నింటినీ జపాన్?లోని కొరోగి అథ్లెటిక్ పార్క్?లో నిర్వహించనున్నారు. మహిళల క్రికెట్ పోటీల్లో భారత్, శ్రీలంక, జపాన్, మలేసియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, థాయ్?లాండ్? జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్?లు సెప్టెంబర్ 17న షురూ కానుండగా, టీమ్ఇండియా మహిళలు తమ మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 18న ఆడనుంది. ఈ మ్యాచ్ జపాన్‌తో జరగనుంది.ఆ తర్వాత 20, 22 తేదీల్లోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్?లు నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 22న జరుగుతుంది, అలాగే కాంస్య పతక పోరు కూడా అదే రోజు ఉంటుంది. ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. గత సీజన్?లో గోల్డ్ మెడల్ సాధించిన టీమ్ఇండియా మరోసారి అదే ప్రదర్శనను రిపీట్ చేయాలని ఆశిస్తోంది. పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్?తోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు టోర్నమెంట్‌లో నేరుగా అర్హత సాధించాయి. ఈ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడుతాయి. మరోవైపు, ఆఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్ టీమ్స్?ను 'గ్రూప్ ూ'లో ఉంచారు. హాంకాంగ్, చైనా, మలేసియా, ఒమన్ జట్లను 'గ్రూప్ దీ'లో చేర్చారు. ఈ గ్రూపులలో విజేతలుగా నిలిచిన జట్లు, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో తలపడతాయి. గ్రూప్ స్టేజ్?లో ఓడిపోయిన జట్లు పోటీ నుంచి నిష్క్రమిస్తాయి. ఇక పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న ప్రారంభమవుతాయి. ముందుగా గ్రూప్ ఏ, గ్రూప్ బీలోని జట్లు పోటీపడతాయి. ఆ తర్వాత భారత 28న తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే అది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కాబట్టి ప్రత్యర్థి ఎవరో ఇంకా తేలలేదు. అయితే శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమ్ఇండియా ఈ పోటీలో ఆడనుంది. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.



# 44 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టిన సోనాల్ దినుషా

**కొలంబో, ఆగస్టు 26 :** శ్రీలంక యువ బ్యాటర్ సోనాల్ దినుషా భారత జట్టుపై అద్భుత ప్రదర్శనతో సరికొత్త చరిత్ర సృష్టించాడు. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగులతో సెంచరీ సాధించిన ఆయన, టీమిండియాపై తన కెరీర్‌లోని తొలి రెండు టెస్టుల్లోనూ శతకాలు బాదిన రెండో శ్రీలంక ఆటగాడిగా 44 ఏళ్ల నాటి రికార్డును సమం చేశాడు. అంతకుముందు 1982లో శ్రీలంక దిగ్గజ ఆటగాడు దులీప్ మెండిస్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. అలాగే ప్రపంచ క్రికెట్‌లో భారత్‌పై తొలి రెండు టెస్టుల్లో సెంచరీలు చేసిన 8వ బ్యాటర్‌గా దినుషా నిలిచాడు. ఈ సిరీస్‌లో దినుషా బ్యాటింగ్ శైలి భారత బౌలర్లకు పెద్ద సవాలుగా మారింది. గాలే టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులు, తర్వాతి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు చేసిన ఆయన, ఇప్పుడు కొలంబో టెస్టులోనూ 162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 103 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. 2026 సంవత్సరంలో టెస్టుల్లో అత్యుత్తమ నిలకడ ప్రదర్శించిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. అయినప్పటికీ, భారత్ తొలి ఇన్నింగ్స్ 503/9 (డిక్లేర్డ్) పరుగులకు సమాధానంగా శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకే ఆలౌట్ కావడంతో టీమిండియా ఫాలోఆన్ విధించింది.



# చెస్ విన్నర్స్ నిదీష్, యశ్వి

**హైదరాబాద్ :** తెలంగాణ అండర్-17 చెస్ చాంపియన్‌షిప్‌లో మాస్టర్ నిదీష్ శ్యామల్, యశ్వి జైన్ విజేతలుగా నిలిచారు. బాచుపల్లిలోని వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీలో భాగంగా బాయ్స్ కేటగిరీలో 174 మంది, గర్ల్స్ విభాగంలో 48 మంది తలపడ్డారు. బాయ్స్ నుంచి నిదీశ్ 6 పాయింట్లతో చాంపియన్‌షిప్‌ను గెలుచుకోగా గర్ల్స్ విభాగంలో యశ్వి (5 పాయింట్లతో) విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో గెలిచిన ప్లేయర్లు జమ్మూకశ్మీర్‌లో జరుగబోయే జాతీయ అండర్-17 చెస్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణకు ప్రాతినిథ్యం వహించనున్నారు.






# జైస్వాల్‌నే కాదు వైభవ్‌ని కూడా శిక్షించాల్సిందే..

## టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్

కొలంబోలో జరుగుతున్న 2వ టెస్ట్ తొలి రోజు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్, అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వాగ్వాదం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ 17వ ఓవర్లో ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత జైస్వాల్ అతడి వైపు వెళ్లగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు కదిలించాడు. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో ఇద్దరి తలలు తాకాయి. ఘటనపై ఐసీసీ చర్యలు తీసుకుని ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మంజ్రేకర్ మాత్రం ఈ శిక్ష సరిపోదని అభిప్రాయపడ్డారు. మైదానంలో శారీరకంగా తాకడం వంటి ఘటనలకు కఠినమైన చర్యలు అవసరమని ఆయన సూచించారు. ఈ సందర్భంగా యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన గత ఘటనను మంజ్రేకర్ ప్రస్తావించారు. ఈ ఏడాది జరిగిన ఏ జట్ల ట్రై-సిరీస్‌లో భారత్ ఏ తరపున ఆడిన వైభవ్.. శ్రీలంక ఏ ఆటగాళ్లతో ఘర్షణకు దిగిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఐసీసీ, బీసీసీఐ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంజ్రేకర్ కోరారు. యువ ఆటగాళ్లకు ఇటువంటి ప్రవర్తనను ఉపేక్షించడం సరైన సందేశం కాదని ఆయన పేర్కొన్నారు. ఎక్స్‌లో మంజ్రేకర్ స్పందిస్తూ ఐసీసీ, బీసీసీఐని ఉద్దేశించి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "వైభవ్ ఫర్ ఇండియా ఏ ఇటీవల.. ఇప్పుడు జైస్వాల్.. ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకునేలా చేస్తే, అదే ప్రవర్తనను మళ్లీ చేయడానికి వారికి అలవాటు పడేలా చేసినట్టే" అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు క్రీడకు మంచిది కాదని, ఆటగాళ్ల భవిష్యత్తుపైనా ప్రభావం చూపొచ్చని మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. శారీరక ఘర్షణలు జరిగినప్పుడు కఠినమైన శిక్షలు ఉండాలని ఆయన సూచించాడు. రెండో రోజు ఆట ప్రారంభానికి ముందు జైస్వాల్ తన చర్యను సమర్థించుకున్నాడు. "అతను ఏం అన్నాడో మీకు తెలియకపోతే తీర్పు ఇవ్వొద్దు. ఎవరైనా హద్దు దాటితే వారికి తెలియజేయాలి. ఇది భారత్.. మేం పోరాడతాం, సమాధానం ఇస్తాం" అని చెప్పుకొచ్చాడు. జైస్వాల్, ఫెర్నాండోలకు జరిమానాతో పాటు డీమెరిట్ పాయింట్లు పడినా, మంజ్రేకర్ మాత్రం మరింత కఠిన చర్యల అవసరాన్ని ముందుకు తెచ్చారు. వైభవ్ సూర్యవంశీ ఘటనను కలిపి చూస్తే, యువ ఆటగాళ్ల ప్రవర్తనపై క్రికెట్ బోర్డులు ఎలాంటి సందేశం ఇవ్వాలన్న ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది.




ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
27 ఆగస్టు 2026




# బికినీతో రక్షాబంధన్ యాడ్

విమర్శల వెల్లువతో సోషల్ మీడియా నుంచి తొలగింపు

ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'గీవా' ఇటీవల విడుదల చేసిన రక్షాబంధన్ ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ నటి కృతిసనన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాడ్ సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే, పలువురు నెటిజన్లు మరియు కొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. హిందూ సంప్రదాయాలను, పవిత్రమైన రక్షాబంధన్ పండుగను తప్పుగా చిత్రీకరించేలా ఈ ప్రకటన ఉందంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. పండుగ పవిత్రతకు భంగం కలిగించేలా యాడ్ కంటెంట్ ఉందంటూ బ్రాండ్‌పై విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో వ్యతిరేకత పెరగడంతో అప్రమత్తమైన 'గీవా' యాజమాన్యం తక్షణమే స్పందించింది. వివాదాస్పదమైన ఆ ప్రకటనను అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, మీడియా మాధ్యమాల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ వివాదంపై వివరణ ఇస్తూ జీవా సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగలపై మాకు అత్యంత గౌరవం ఉంది. ఎప్పుడూ కుటుంబ సభ్యులందరితో కలిసి పండుగలను ఆనందంగా జరుపుకోవడాన్ని నమ్మే మా బ్రాండ్, ఈసారి ఆ ఆనందాన్ని పెంపుడు జంతువులకు కూడా విస్తరించాలనే మంచి ఉద్దేశంతో ఈ కాన్సెప్ట్‌ను రూపొందిం చాము. అయితే, మా తాజా ప్రకటన సమాజంలోని కొన్ని వర్గాల మనోభావాలను అనుకోకుండా గాయపరిచినట్లయితే, అది మా ఉద్దేశం కానే కాదు. అందరి మనోభావాలను, నమ్మకాలను గౌరవిస్తూ ఆ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నాము అని సంస్థ స్పష్టం చేసింది.




# సుహాస్ విలన్‌గా సముద్ర నేపథ్య కథ

కోలీవుడ్ నటుడు సూరి హీరోగా, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ విలన్ పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'మండాడి'. సముద్రం నేపథ్యంలో రాబోతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను 'సెల్ఫీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. తమిళనాడులోని తీర ప్రాంతాలకు చెందిన సాంప్రదాయ బోట్ రేస్ పోటీల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సముద్రం నేపథ్యంలో సాగే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఇది రూపొందుతోంది. ఇందులో సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, తెలుగు నటుడు సుహాస్‌తో పాటు ప్రముఖ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ సినిమా కోసం హీరో సూరితో పాటు నటుడు సుహాస్ ఎలాంటి బాడీ డబుల్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాలు, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో చాలా కష్టపడి నటించినట్లు తెలుస్తుంది.




# ఇరుముడి నిలిపివేతపై ప్రేక్షకుల ఆందోళన

నారాయణపేట జిల్లా మక్తల్‌లో స్థానిక వెంకటరమణ థియేటర్ వద్ద బుధవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎంతో ఆసక్తిగా తిలకించాలనుకున్న రవితేజ 'ఇరుముడి' చిత్రాన్ని ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా నిలిపివేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రేక్షకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ థియేటర్ గేటు ఎదురుగా బైఠాయించి పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. గత రెండు రోజులుగా ఈ సినిమా కోసం జనం భారీగా పోటెత్తుతున్నారు. తమ సొంత పనులను సైతం పక్కన పెట్టి థియేటర్‌కు చేరుకుంటున్నప్పటికీ, టికెట్లు దొరక్క నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ప్రేక్షకులు వాపోయారు. కనీసం నేడైనా సినిమా చూసే అవకాశం ఉంటుందని ఆశతో వస్తే, ప్రదర్శన రద్దు చేశారన్న వార్త వారిని నిరుత్సాహానికి గురిచేసింది. అవసరమైతే నేలపై కూర్చుని లేదా నిలబడి అయినా సినిమా చూస్తామని, ఎంతటి రద్దీనైనా భరిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ హఠాత్ పరిణామంతో స్థానికంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.




# రోమాంచకం ట్రైలర్ విడుదల

టాలీవుడ్ అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, 'మేమ్ ఫేమస్' చిత్రం ద్వారా యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'రోమాంచకం' . భద్రకాళి పిక్చర్స్ మరియు ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సానిల్‌కుమార్ కథానాయకిగా నటిస్తుండగా, వాసుకి వైభవ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 3న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతుండగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కేవలం సాధారణ ప్రేమకథా చిత్రంగా కాకుండా, నేటి ఆధునిక కాలంలోని డేటింగ్ యాప్స్, రిలేషన్‌షిప్స్ మరియు ఊహించని మలుపులతో కూడిన యూత్ ఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ట్రైలర్‌లో సుమంత్ ప్రభాస్ తనదైన తెలంగాణ నేటివిటీ యాసతో పాటు, తన మార్క్ కామెడీ అండ్ ఎనర్జిటిక్ నటనతో మరోసారి యువతను ఆకట్టుకునేలా కనిపించారు. మొదట ఎంతో సరదాగా, క్యూట్‌గా సాగే ఈ లవ్ స్టోరీ ఆ తర్వాత ఇంటెన్స్ ఎమోషన్స్, ఊహించని గొడవలు మరియు ఉత్కంఠభరితమైన మలుపులతో ఎలా సాగిందనే అంశాలను ట్రైలర్‌లో ఎంతో ఆసక్తికరంగా చూపించారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి ప్రెజెంట్‌గా వ్యవహరిస్తుండటంతో, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మరో మాఫియా డాన్ కథ యశ్ 'టాక్సిక్' మూవీ

'కేజీఎఫ్' ఫ్రాంచైజీ తర్వాత ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన అంచనాలతో బుధవారం విడుదలైన యశ్ కొత్త చిత్రం 'టాక్సిక్'. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గంగా (నయనతార), రాయ్ (యశ్) అక్కాతమ్ముళ్లు. తమ్ముడిని ప్రాణంగా చూసుకునే గంగ, తన తమ్ముడిని గోవా నేరసామ్రాజ్యానికి అధిపతిగా చూడాలనుకుంటుంది. అందుకోసం స్థానిక మాఫియా డాన్‌తో చేతులు కలపగా, రాయ్ ఆ గ్యాంగ్‌లోనే కీలక వ్యక్తిగా ఎదుగుతాడు. అయితే, మాఫియా డాన్ కూతురు రెబెక్కా (తారా సుతారియా), మరోవైపు సర్కస్‌లో పనిచేసే నాడియా (కియారా అద్వానీ)ల రాకతో రాయ్ జీవితంలో అనూహ్య మలుపులు తిరుగుతాయి. నాడియా గర్భవతి కావడం, పరిస్థితుల ప్రభావంతో ఆ మాఫియా డాన్ రాయ్ చేతిలో హత్యకు గురికావడం కథను వేగవంతం చేస్తుంది. శత్రువుల కుట్రల వల్ల నాడియా చేతిలోనే అక్క గంగ దారుణంగా హత్యకు గురవడంతో... రాయ్ తన ప్రియురాలిని క్షమించాడా? అక్క కోరిక ప్రకారం గోవా డోన్‌గా ఎలా మారాడు అనేదే మిగతా కథ. 'కేజీఎఫ్'లో అమ్మ సెంటిమెంట్ ఎలాగో, ఇందులో 'అక్క సెంటిమెంట్' ప్రధాన బలమని చెప్పవచ్చు. ప్రథమార్థం కాస్త సాధారణ మాఫియా డ్రామాగా సాగినా, ద్వితీయార్థంలో వచ్చే మానసిక సంఘర్షణ, మలుపులు ఆడియన్స్‌కు కొత్త అనుభూతినిస్తాయి.



అయితే, కథ కంటే కూడా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ యాక్షన్, వైలెంట్ ఎలిమెంట్స్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నరకాలు, రక్తపాతం, ఇంటిమేట్ సీన్లు ఎక్కువగా ఉండటంతో ఇది కుటుంబ ప్రేక్షకులకు అంతగా సరిపడదు. యశ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయంలో రఫ్ అండ్ టఫ్ లుక్‌లో మెప్పించగా, నయనతార అక్కగా తన యాక్షన్ సీక్వెన్సులతో ఆకట్టుకుంది. కియారా భావోద్వేగ పాత్రలో ఒదిగిపోగా, తారా సుతారియా, రుక్మిణీ వసంత్ పాత్రలు గ్లామర్‌కే పరిమితమయ్యాయి. సాంకేతికంగా 'టాక్సిక్' టాప్ నోచ్‌లో ఉంది. రవి బస్రూర్ నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం సినిమాను వేరే లెవల్‌కి తీసుకెళ్లాయి. నిర్మాతలు పెట్టిన ప్రతి పైసా తెరపై కనిపిస్తుంది. కథనం కాస్త సంక్లిష్టంగా ఉండటం, మాస్ ఎలిమెంట్స్ మితిమీరడం మినహా.. యాక్షన్ ప్రేమికులకు, యశ్ అభిమానులకు ఈ చిత్రం విజువల్ ఫీస్ట్‌లా నిలుస్తుంది.

# ది వీవాన్ టీజర్ విడుదల

బాలీవుడ్ హ్యాండ్సమ్ హీరో సిద్దార్థ్ మల్హోత్రా స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది వీవాన్'. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అరుణాభ్ కుమార్ కథను అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు బాలాజీ మోషన్ పిక్చర్స్ ది వైరల్ ఫీవర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే.. సూర్యాస్తమయం తర్వాత ఎక్కడికి వెళ్లడం నిషిద్ధమో.. కథ అక్కడి నుంచే మొదలవుతుందనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఎవరైతే రాత్రి సమయంలో ఆ అడవిలోకి వెళ్తారో వారు తిరిగి రారనే ఒక దట్టమైన చీకటి శక్తి, రహస్యాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో సిద్దార్థ్ మల్హోత్రా ఇప్పటివరకు చూడని సరికొత్త యాక్షన్ అవతార్‌లో కనిపించగా, ఆయనకు ఆ అడవికి మధ్య ఏదో గూఢమైన సంబంధం ఉందని తమన్నా పాత్ర చెబుతుంది. టీజర్ చివర్లో వచ్చే విజువల్స్ దైవిక శక్తులు మరియు పురాణాల నేపథ్యాన్ని గుర్తుచేసేలా ఉన్నాయి. ఈ చిత్రంలో సిద్దార్థ్, తమన్నాలతో పాటు సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ మరియు అనూప్ సోని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717